# కొత్త రచయితలు

# 'పిల్లపేరు మల్లెమొగ్గ.... నాపేరు జమీందార్!

## తెర తొలగించా!

సూర్య కిరణాలు ముఖాన్ని తాకడంతో ఇబ్బంది పడ్డ కళ్ళను నులుముకొంటూ చూశాను.

వసంతం అంతా అక్కడే వచ్చి నిలబడిందా అన్నట్టు ఆ ఇంటి వాకిలి పచ్చగా కల్లాపి జల్లి, రంగు రంగుల ముగ్గులతో కళారంజితంగా ఉంది!

ఆ రంగవెల్లుల మధ్య రంగుల జలతారు...కాదు,రంగుల నూలు కలనేత వోణీలో ఆ అమ్మాయి అందంగా...అపురూపంగా...

రోజూ ఆ ముగ్ధ మనోహర దృశ్యం చూడ్డం నాకు అలవాటు.

అలా గత నాలుగేళ్ళుగా నాకు పరిచయమైన దృశ్యమది!

ఎదను కదిలించి, హృదిలో వేనవేల సున్నిత తంత్రులను మీటి పరవశానందరాగాన్ని పలికించే ఆ ఉదయ హృదయ నైవేద్య దృశ్యాన్ని కన్నులారా తిలకించడం, ఆ స్మృతులతోనే ఇరవై నాలుగ్గంటలూ గడపడం... తిరిగి తెల్లవారకుండానే ఎదురు చూడ్డం...ఓహ్!

ఆ అందమైన దృశ్యానికి వన్నె తెచ్చిన అమ్మాయి పేరు.

మల్లె మొగ్గా!...కాదు...కానీ అటువంటిదే... మల్లిక!

భోజరాజును చూసినవాడు కవిత్వం చెప్పినట్టుగానే, మల్లికను చూస్తున్న నాకూ కావ్య గానాలను చేయాలనిపిస్తుంటుంది. అంత అందం ఆమె సొంతం. కాకపోతే తెలుగు భాషలోసొగసులు తెలీని నేను కవిత్వం చెప్పాలనుకోవడం ఏమిటి?! నా చదువంతా ఆంగ్లంలోనే.

నాలుగు సంవత్సరాల క్రిందటే మా ఊరు వలసవచ్చిన పేద కుటుంబానికి చెందినమ్మాయి మల్లిక. ఆమె తండ్రి వ్యవసాయ కార్మికుడు. తల్లిలేని మల్లిక తన తర్వాత పుట్టిన పిల్లలిద్దరికీ, తండ్రికీ కూడా తల్లయింది.

అప్పటికి పన్నెండు పదమూడేళ్ళ వయసున్న మల్లికను, ఆమె తర్వాత ఇద్దరు పిల్లలను వెంట బెట్టుకొని, భార్య మరణం తర్వాత మా ఊరు వచ్చేశాడు ఆమె తండ్రి రామస్వామి.

అతని జాలి కథ విని, చలించి పోయిన తాతయ్యగారు దివాణం ఎదురుగా వున్న ఖాళీ స్థలంలో పాకేసుకోమన్నారు. తాతయ్యగారు అలా చాలామందికి చోటు చూపించారు. నాన్నగారికి మాత్రం తాతగారి పద్ధతి నచ్చలేదు. ''దివాణం బంగ్లాకెదురుగా మీ మూలంగానే అలగా జనం పాకలు పెరిగి పోయాయని ఆయన విసుక్కుంటూ ఉంటారు.

ఇదేం పట్టదు తాతయ్యగారికి. జమీందారీలు పోయినా దర్జాలు పోయినా చేతికి ఎముక లేకుండా, మనసుకు మచ్చ రాకుండా ప్రవర్తించడంవల్లనే భగవంతుడు చల్లగా చూస్తున్నాడని ఆయన నమ్ముతారు.

నాన్నగారి పద్ధతంతా వేరు. తాతగారి కంటే ఒక తరం ముందైనా వారిద్దరి మనస్తత్వాల మధ్య ఎన్నో యోజనాల అంతరం. కూలి జనాల్ని,కూటికి లేని వాళ్ళనూ ఎప్పుడూ దూరంగా ఉంచాలనే అంటారు. జాగీర్లు పోయినంత మాత్రాన జమీందారు జమీందారు కాకుండా పోడని, రక్తంలో ఆ పొగరు, పౌరుషం చల్లారదని ఆయన ఇప్పటికీ వాదిస్తుంటారు.

నాకయితే ఈ జమీందారీ మెహర్బాణీలకు అతీతంగా ప్రవర్తించే తాతయ్యగారే నచ్చుతారు. ఆయన ఆకారం, ఆంగికం పాతతరాన్ని స్ఫురింపజేస్తుంది గానీ, మనసు మాత్రం చిన్నపిల్లవాని కంటే అధ్వాన్నం!

బహుశా, తాతయ్యగారిని నేనింతగా ఇష్టపడ్డానికీ, నాన్నగారిని మనసులో ఏ మూలనో ద్వేషించడానికి కారణం మల్లికను నేను అమితంగా ఇష్ట పడ్డమే కావొచ్చు.

అందం కంటే మల్లికలో అణకువ, వినయం ఇవన్నీ నాకు ప్రియంగా మారాయి.

మా దివాణంలో ఒహప్పుడు మనుషులు తక్కువ, సేవకులెక్కువ వుండేవారట. ఇప్పుడు మనుషుల కంటే సేవకులే తక్కువ. అందులో మల్లిక కూడా ఒకర్తి.

''చిన్న జమీందారు బాబూ!'' అని పిలుస్తుంది నన్ను.

ఆక్స్‌ఫర్డ్‌లో చదివిన నా మాటల్ని, నా తెలుగును విని, అలవోకగా నవ్వుతుంటే ఆమె నవ్వుల్ని దోసిలిపట్టి అందుకోవాలని పిస్తుంది.

ఆమెపట్ల నాకు కలిగిన ఆకర్షణ ఇష్టంగానూ, తర్వాత ప్రేమగానూ మారింది!

''ఇంకెప్పుడూ చెయ్యనండీ! బాబోయ్!...నన్ను వొదిలి పెట్టండి....మీ కాళ్ళు పట్టుకుంటాను''

పెద్దగా అరుపులు...కేకలు... మధ్యలో ఏడ్పులు.

గబగబా మేడ దిగి కిందికి వచ్చాను.

కింద నాన్నగారి చేతిలో కొరడా నిప్పులు చిమ్ముతూ వేగంగా ఊగిపోతూంది.

''వెధవా! పోనీలే అని మీకు

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

జాగా చూపిస్తే...తిన్నింటి వాసాలే లెక్క పెడతా్రరా! ఎంత ధైర్యం మీకు?''

నాన్నగారి గొంతులోంచి పిడుగులు కురిశాయి.

నేరంచేసినవాడి వంక చూశాను నేను.

మల్లిక తమ్ముడు వాడు. పన్నెండేళ్ళవాడు.

వాడి చేతిలో జామకాయ లున్నాయి. అవి మా తోటలోవే నని వాటి రంగేచెబుతూంది.

పసిపిల్లాడు చేసే బాల్య చేష్టకు దొంగతనం ఆపాదించి,గొడ్డును బాదినట్టు వాడిని బాదడంలో ఔచిత్యం కనిపించలేదు, రాక్షసత్వం తప్ప.

అదే అందామనుకున్నాను. ఆ మాటలు గొంతుదాటి బయటకు రాలేదు.

తాతయ్యగారూ అప్పుడే వచ్చారు.

'మీరిచ్చిన అలుసే... చూడండి!' అన్నట్టు చూశారు ఆయన వంక నాన్నగారు.

తాతయ్యగారేం మాట్లాడలేదు.

్రబిటిష్‌వాడు దోచుకెళ్ళిన దానిలో ఆ రెండు జామకాయల విలువా ఎంతని మా్రతం ఆయన కళ్ళు ్రపశ్నించాయి.

మల్లిక తం్రడి పిల్లవాడి తరపున అందరికీ పేరుపేరునా క్షమాపణలు చెప్పకొని, పిల్లాడ్ని చేతుల్తో బాదుకుంటూ అక్కడ్నుంచి తీసుకెళ్ళిపోయాడు.

---


రచయిత చిరునామా
ఎస్.కె. నాగేశ్వరరావు
సాయిబాబా గుడి వద్ద
పెనుగొండ - 534 320
(ప.గో. జిల్లా)



అప్పుడే నేనూ అక్కడ్నుంచి కదిలి మేడమీదకు వెళ్ళి పోయాను.

నాకెందుకో నాన్నగారి చర్య నా భవిష్యత్ మీద బలమైన ము్రద వేస్తుందేమోనన్న భయం ఒక్కసారిగా ఆవరించింది.

ఆ రా్రతి నేను భోజనం చేయలేదు. చేయాలని అనిపించ లేదు.

సంగతి తెలిసి మల్లిక పిలవడానికి వచ్చింది.

''చిన్న జమీందారు బాబూ!'' పిల్చింది.



''నాపేరది కాదు...ఫో''అరిచాను.

ఎందుకో...ఎవరిమీదో తెలీని కోపం!

''మా తమ్ముడు తెలీక చేసిన పనికి మీరు కూడా కోపం చూపిస్తున్నారా చిన్న జమీందారు

బాబూ?''

మల్లిక కళ్ళలో సన్నని కన్నీటి పొర.

అది నా గుండెను మరింత కలచి వేసింది.

"అదేం కాదు...హెల్త్ బాగా లేదు..అందువల్ల..." చెప్పాను.

"ఏదీ నన్ను చూడనివ్వండి"

ముందుకు వచ్చి నా చేతిని తాకింది.

చాలా దగ్గరగా వున్న ఆమె శరీరం...ఆ స్పర్శ...నాలో వివశత్వాన్ని కలిగించాయి. ఒక చేత్తో ఆమె చేతిని గట్టిగా బిగించి, రెండో చేత్తో ముందుకు లాగాలని నేను చేసిన ప్రయత్నాన్ని ఆమె ముందే అడ్డుకొంది.

"ఇదన్నమాట మీ ప్లాను...వదలండి జమీందారు బాబూ!"

"వదలను...వదలనుగాక వదలను" చేతి పట్టును మరింత బిగిస్తూ మొండిగా అన్నాను.

"ఎంత కాలం దాకా వదలరు?"

"జీవితాంతం..." చెప్పాను నిజాయితీగా.

దెబ్బతిన్న పక్షిలా ఆశ్చర్యంగా చూసింది మల్లిక.

"మీరేం మాట్లాడుతున్నారు జమీందారు బాబూ!" విస్మయం ఆమె గొంతులో. "నిజం మాట్లాడుతున్నాను. తెలుగే మాట్లాడుతున్నాను..."

ఇదివరకు నా మాటలకు, నా భాషకు ఆమె అలవోకగా నవ్వే నవ్వును గుర్తుకు తెస్తూ అన్నాను.

"ఇది పెద్ద జమీందారు బాబు గారికి తెలిస్తే మీకు ఈ నీడా లేకుండా పోతుంది. మీది పెద్ద వంశం. మేము మీ కాళ్ళదగ్గర బ్రతికేటోళ్ళం. పెద్ద ఆశలు పెట్టకండి. పరమాన్నం కోసం ఆశించి, ఉన్న గంజిని పారబోసు కొనేలా చేయకండి. మీకు దణ్ణం పెడతాను..."

నా పట్టు నుండి విడి వడి చేతులు జోడిస్తూ అంది మల్లిక.

ఆమె ముఖంలో కనిపించిన దైన్యం నా గుండెను గిల్లినట్టని పించింది. నా వంశం, చరిత్ర. ఆమెను మోసం చేస్తాయేమోనన్న భయాన్ని...ఆమె పేదరికం అందుకు బలాన్ని కలిగిస్తున్నా యేమోననిపించింది!

వాతావరణం తేలిక పరచాలని అన్నాను.

"ఏయ్! మల్లికా ఎందుకా భయం నీ పేరు "మల్లె మొగ్గ" అయితే, నా పేరు "జమీందార్" నువ్వు పెట్టిందే. మన పేర్లు ఇంత తీరుగా కలిశాయి కదా! జీవితా లెందుకు కలవ్వని అను కుంటున్నావ్?"

"ఏమో మీరెన్ని చెప్పండి. నాకు భయంగానే ఉంది. మా తమ్ముడు జామకాయలు కోసి నందుకే కొరడా ఝుళిపించారు మీ తండ్రిగారు. ఇహ ఈ సంగతి తెలిస్తే నన్ను కత్తికో కండగా కోసి కాకులకు, గ్రద్దలకు ఎగరేసి తలకాయను దివాణం గుమ్మానికి వ్రేలాడతారేమో!?"

మల్లిక గడగడలాడుతూ చెబుతుంటే నాకు నవ్వాగింది కాదు."మల్లికా నీకా భయం లేదు" నవ్వుతూ అన్నాను.

"నేను ఇంత చెబుతున్నా, ఇదంతా మీకు నవ్వులాటగా వుందా జమీందారు బాబూ! ఆశకు కూడా హద్దుండాలి. ఇలాంటి 'ఆశ'లతో ఇహనుండి ఈ దివాణం గడప తొక్కలేను. నన్ను క్షమించండి"

గిరుక్కున వెనక్కు తిరిగి, పరుగులాంటి నడకతో వెళ్ళి పోయింది మల్లిక.

ఆమెను ఆపి, మరింత కాల హరణ చేయడం తప్ప ప్రయోజనం లేకపోవడంతో




Heros' BS-26 TL

చూస్తూ ఉండిపోయాము అటే.

ఆరోజుదివాణంకి లాయర్ చలమయ్య వచ్చారు. దివాణం పొలాలమీద ప్రభుత్వంతో మాకున్న వాజ్యం మా పక్షాన కాకుండా ప్రభుత్వ పక్షాన తీర్పు వచ్చిందట.

సంగతి విని నాన్నగారు నిప్పులు త్రొక్కారు.

తాతయ్యగారు మాత్రం అలవాటుగా ఏమీ మాట్లాడలేదు.

"మీరు సమ్మతిస్తే పై కోర్టుకు అప్పీలు చేద్దాం" చెప్పారు లాయర్. నాన్నగారు అందుకు సమ్మతించలేదు. "ఇప్పటికి అయ్యింది చాలు... ఈ బంగ్లామీద అప్పుతెచ్చి ఇంతకాలం వాజ్యం నడిపాం. ఇప్పుడది అమ్మేసి అదిగో ఆ పాకల్లోకి పోవాలి...మీరు వెళ్ళండి" అన్నారాయన. చలమయ్య వెళ్ళి పోయారు. ఆయన వదిలివెళ్ళిన మన స్తాపం మాత్రం మమ్మల్ని విడవలేదు.

ఆ రాత్రి నాన్నగారికి హార్ట్ ఎటాక్ వచ్చింది.

డాక్టర్లు ఇరవై నాలుగు గంటలూ కష్టపడ్డాక, తిరిగి ఆయన మాకుదక్కారు.

ఆయన్ని ఇకపై ఏ విషయం లోనూ ఉద్రేకపడొద్దని చెప్పి వెళ్ళారు వాళ్ళు. ఈ సంఘటనతో నన్ను మరో సమస్య చుట్టు ముట్టినట్టని పించింది. మల్లిక పట్ల నేను తీసుకున్న నిర్ణయమది!

ఆ నిర్ణయంగానీ బహిరంగ పరిస్తే నాన్నగారిని శాశ్వతంగా వదులుకోవలసివస్తుందేమోనన్న భయం.

అలాకాక, దాచిపెడితే మల్లిక దక్కదేమోనన్న ఆందోళన.

మల్లిక పట్ల ప్రేమను చంపుకొని, రక్తంలో జీర్ణించుకు పోయిన రాజసాన్ని, ఆ అహం కారాన్ని నాన్నగారిలా నింపుకొని రాయిలా బ్రతికేయడమో...లేక మల్లికి కోసం తెగించి బయట పడ్డమో తేల్చుకోవలసిన అవసరం ఎదురైంది ఆ క్షణం నాకు.

"ఎక్కువ ఆవేశపడకురడా నా నిర్ణయం వినండి. వంశం... చరిత్ర...దివాణం అంటూ నా నిర్ణయాన్ని నీరు కార్చకండి. ఇంతకాలం మీరంతా గతకాల స్మృతుల్ని వదులుకోలేక లేని భేషజాన్ని, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ భవిష్యత్‌పై ఆలోచన లేకుండా జీవిస్తూ వస్తున్నారు. మీ వారసుడిగా నాకు జాగీర్లు, జమీందారీలు మిగలకపోయినా మీ రక్తం నింపుకొని పుట్టి నందుకు నడిరోడ్డుమీద నిలబడేట్టు చేయకండి.

నాతోపాటు చదువుకున్న మిత్రుడొకడు మద్రాసులో వున్నాడు. నాకోసం ఒక మంచి ఉద్యోగం చూసి ఉంచాడు.

నేను ఎక్కడోదూరంగా ఉంటాను... ....జమీందారుగారి సంతతి మామూలు నౌకరీ చేస్తున్నాడనే తలవంపు మీకుండ నంత దూరంగా!రేపే ప్రయాణం. మీరు ఇందుకు అనుమ తించడమే కాదు...ఆనందిస్తారు కూడా!"

చాలా మెల్లగా చెప్పాను. నాన్నగారికి ఎటువంటి ఆవేశం కలగనంత సౌమ్యంగా చెప్పాను. ఎప్పుడొ గొంతు చించుకొని అరిచే ఆయన మౌనం దాల్చారీ సారి.

తాతయ్యగారు మాత్రం తెల్లని గుబురుమీసాల చాటునుండి మెచ్చుకోలుగా నవ్వారు. ఆయన చూపుల్లో ఆశీస్సులు కనిపించాయి.

అరచి అల్లరి చేయకుండా ఆత్మీయంగా చెప్పే మాటలు ఎంతటి మంచి ఫలితాన్ని అందిస్తాయో అనుభవైక వేద్య మయింది ఆ క్షణం. మేడమీద కెళ్ళి మర్నాటి ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్న మయ్యాను.

తలుపు దగ్గర అలికిడి అయితే తల తిప్పి చూశాను.

ఎదురుగా మూర్తీభవించిన శోక దేవతలా మల్లిక.

కదిపితే చాలు కట్టలు త్రెంచుకు ప్రవహించేందుకు సిద్ధంగా వున్న రెండు నదులను నింపుకుని భారంగా వున్న కనుకొనలు!

"నువ్వు వస్తావని తెలుసు మల్లికా! రా...రా..." అన్నాను మెల్లగా..

"నా కోసం మీరు దూరంగా వెళ్ళిపోతున్నారు కదూ! చిన జమీందారు బాబూ!" పైట చెంగుతో కళ్ళను వొత్తుకుంటూ అందామె.

"మరి నువ్వు నాకోసం ఇష్టం లేని పెళ్ళి చేసుకుని దూరమై పోదామనుకోలేదూ?..." ఎదురు ప్రశ్న వేశాను.

సమాధానం లేదు మల్లిక నుండి.

"పిచ్చి మల్లికా! నా ప్రయాణంలో ఒక గొప్ప నిర్ణయ ముంది. మరో నాలుగేళ్ళ తర్వాత నేను వస్తాను. అది ఎవరి కోసమో నీకు తెలుసు. మా తాతయ్యగారికీ తెలుసు. కాలం సమస్యలకు...అవి ఎంత గడ్డు సమస్యలయినా పరిష్కారం చూపిస్తుందంటారే. అది నిజం. నేను నిన్ను కోరుకుంటున్నాను. దానికి ప్రేమ అనే పేరు పెట్టినా, పెట్టకపోయినా ఆ ప్రేమను పండించుకోవడం నా కర్తవ్యం. అందుకే...నీ కోసం... నేనిలా ఈ జమీందారీ పంజరం నుండి శాశ్వతంగా దూరమవడా నికి...నీ నుండి తాత్కాలికంగా దూరమవుతూ వెడుతున్నాను...మరి వెళ్ళిరానా..."

అర్థోక్తిగా ప్రశ్నించి ఆగి పోయాను.

మల్లికిప్పుడు మంచులో తడిసిన మందారమయ్యింది. సిగ్గుతో ఆమె చెంపలు కెంపులయ్యాయి. కళ్ళు కృతజ్ఞతతో విచ్చుకున్న కలువలయ్యాయి.

ఆర్తిగా "జమీందారు బాబూ!" అంటూ నా ముందు మోకాళ్ళపై కూలబడింది మల్లిక.

"అరరే...ఇదేంటి పిచ్చి... నేనేమీ త్యాగం చేయడం లేదు. బాధ్యత నిర్వర్తిస్తున్నాను" ఆమెను లేవనెత్తి గుండెలకు హత్తు కున్నాను.

ఆమె జడలో మల్లెల పరిమళం వళ్ళంతా పులకింతలు రేకెత్తి స్తోంది. మల్లికకు ఆ కౌగిలింతలో జలదరింత కలి గిందేమో చిన్నగా కంపించి, నన్ను మరింత హత్తుకు పోయింది.

ఆమె అధరాలు చిగురుటాకుల్లా అల్లల్లాడుతుంటే నా అధరాలు వాటిని అందుకొన్నాయి. మల్లిక కన్నులు అరమోడ్పులైతే, ఆమె తనువు మాధవీలతలా నాలో ఐక్యం కావడానికి ఆత్రపడు తూంది.

ఎప్పుడో చిన్నప్పుడు ఆక్స్‌ఫర్డ్‌కు వెళ్ళకముందు ఊరిబడిలో మాస్టారు చెప్పిన పాట గుర్తుకు వచ్చిందాక్షణం.

'పిల్లపేరు...మల్లెమొగ్గ...
నాపేరు...జమీందార్!'
నిజమే!

*

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్